క్రీడా స్ఫూర్తితో మెలగాలి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్రలో ఆల రఘుపతిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన దేవరకద్ర ప్రీమీయం లీగ్ క్రికెట్ సీజన్–2 ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్‌తో పాటు ఉన్నత స్థానానికి ఎదగడానికి మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగినప్పుడే గెలుపు సాధ్యపడుతుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, సమానంగా చూడాలని కోరారు.

విజేతజట్టుకు ట్రోఫీ, నగదు అందజేత..
దేవరకద్రలోని వీరప్పయ్యస్వామి గ్రౌండ్‌లో పది రోజులుగా నిర్వహించిన డీపీఎల్ సీజన్–2 ట్రోఫీ టోర్నమెంట్ ఫైనల్‌లో గెలుపొందిన సోమశిల సోల్జర్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.60వేల నగదును ఎమ్మెల్యే ఆల ఆందజేశారు. అలాగే రన్నర్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.40వేల నగదును అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నపూర్ణ, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, కరణంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, శివానంద్, బాల్‌రాజు, ఆనంద్, రాజేశ్వర్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత..
అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌కు చెందిన నర్సింహారెడ్డి అనారోగ్యానికి గురవడంతో చికిత్స కోసం సీఎం సహాయనిధి ద్వారా రూ.2లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీని ఆదివారం అన్నాసాగర్‌లోని తన నివాసంలో ఎమ్మెలే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ కోఆప్షన్ మహెమూద్, నాయకులు విజయకుమార్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అన్నాసాగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అడ్డాకుల, భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన పత్రాలను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ముడా డైరెక్టర్ సాయిలు, అశోక్ గౌడ్, విండో డైరక్టర్ గడ్డం రాములు, నర్సింహులు, ప్రేమ్‌కుమార్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం పోచమ్మ ఆలయ నిర్మాణానికి మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు ఆర్థికసాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్లు రామాంజనేయులు, యాదమ్మ, వనజ, హౌసింగ్ బోర్డు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.యాదయ్యగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం..
జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని సత్యం చౌరస్తాలో ఓవా కేర్ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆదివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతాన లేమితో బాధపడే దంపతులు ఓవాకేర్ సంతాన సాఫల్యం కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ వెంకన్న, కృష్ణమోహన్, ఐఎంఏ అధ్యక్షుడు రామ్మోహన్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి

మిడ్జిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి బీజేపీ కార్యకర్తలు బూత్ స్థాయిలో గ్రామాల్లో ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నరేందర్ అధ్యక్షతన మండల స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి, నాయకులు శ్రీధర్, పాండురంగారావు, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నిధుల మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మల్కాపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు హనుమాన్ గడ్డతండా, అభంగపట్నం గ్రామపంచాయితీల భవన నిర్మాణాల కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. గ్రామపంచాయతీ నిర్మాణాల కోసం రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరుకావడం జరిగిందన్నారు. అనంతరం మల్లాపూర్‌లో బస్టాండ్ నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు పత్రాన్ని, అదేవిధంగా అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త భీమయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందితే, కుటుంబ సభ్యులకు పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ కింద రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేంద్రప్రసాద్‌గౌడ్, ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ కిరణ్, సర్పంచ్ మాధవి, పులిసింగ్‌నాయక్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

గండీడ్: మండలంలోని వెన్నచేడ్, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం జంగంరెడ్డిపల్లి లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం వైభవంగా చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హన్మంతు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్‌లో ఆదివారం 1992 బ్యాచ్‌కు సంబంధించి పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాల, శాలువాలతో సన్మానించారు. అదేవిదంగా 1989 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు మయూరి నర్సరీలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు మలహార్‌జీ, కిషోర్ కుమార్, అమీర్ అహ్మద్, శ్రీరాములు, చెన్నారెడ్డి, యుర్మియా, అచ్చుతారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కు చెందిన తెలుగు బాలసత్యన్న కుమారుడు తిరుపతి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటుండగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, రాజేష్, కొత్త కృష్ణయ్య, బుడ్డన్న, బాలయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో వైభవంగా మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శివ లింగానికి పంచామృతం అభిషేకం, పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం మెట్లపూజ నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి శివస్వాములు అధిక సంఖ్యలో హాజరై శివ నామస్మరణలతో భజన కీర్తనలు ఆలపించారు. గ్రామంలో శివ నామస్మరణ మారుమ్రోగింది. అంతేకాక అశోక్‌రెడ్డి కళాబృందం ఆలపించిన శివనామ కీర్తనలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమానికి మహిళలు, గ్రామస్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఖేల్‌కూద్ పోటీలకు విద్యార్థి ఎంపిక



నవాబుపేట: లక్నోలో ఈ నెల 6వ తేదీ నుంచి జరిగే అంతర్జాతీయ స్థాయి ఖేల్‌కూద్ పోటీలకు మండలంలోని చెన్నరెడ్డిపల్లికి చెందిన 9వ తరగతి విద్యార్థిని పూజ ఎంపికైంది. ఆదివారం విద్యార్థి లక్నోకు బయలుదేరింది. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు తల్లితండ్రులు ఆనంద్, లక్ష్మిలను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

బీఎస్పీ యువజన కార్యవర్గం ఏర్పాటు

చిన్నచింతకుంట: బహుజన సమాజ్ పార్టీ నూతన కమిటీని ఆదివారం కొత్తకోట పటణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బసిరెడ్డి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు పార్టీ కండువాలు కప్పి అభినందించారు.

తీగజాతి మొక్కలకు ఏర్పాట్లు

జడ్చర్ల టౌన్: బొటానికల్ గార్డెన్‌లో తీగమొక్కలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సమన్వయకర్త డా.సదాశివయ్య తెలిపారు. ఆదివారం తీగమొక్కల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పైపులు బీఆర్‌ఎస్ నాయకుడు ధృవబాదిమి సమన్వయకర్తకు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత



గండీడ్: మండలంలోని జంగంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న మహిళ మొగులమ్మ ఇటీవల ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గాయాలపాలై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న 2005–07 బ్యాచ్ మహబూబ్‌నగర్ కళాశాల ఉపాధ్యాయులు స్నేహమయి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బాధితురాలిని పరామర్శించారు. బాధిత మహిళ కూతురు వెంకటమ్మకు ట్రస్టు ఆధ్వర్యంలో రూ.26వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వసంతపురంరాజు, రఘురాంశర్మ, కృష్ణారెడ్డి, బిచ్చయ్యగౌడ్, శ్రీను, శివకుమార్, వెంకటేష్, రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



కార్తీక్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న సినీనటుడు సుమన్



సర్టిఫికెట్ అందుకుంటున్న హారిక

బ్లాక్‌బెల్టు సాధించిన కార్తీక్..
బ్లాక్‌బెల్టు గ్రేడింగ్ పరీక్షలో జిల్లాకు చెందిన కార్తీక్ బ్లాక్‌బెల్టు సాధించినట్లు మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఫౌండర్ కేశవ్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో కార్తీక్‌కు సినీనటుడు సుమన్ బ్లాక్‌బెల్టు సర్టిఫికెట్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రుద్రమదేవి షోటోకాన్ కరాటే అకాడమీ ఫౌండర్ లక్ష్మీ, బాల్‌రాజు, శివకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన..
హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థి హారిక ప్రతిభ కనబరిచినట్లు ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేశ్ తెలిపారు. ఈ పోటీల్లో హారిక కతాస్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి పతకం, సర్టిఫికెట్ సాధించినట్లు తెలిపారు. పతకం సాధించిన విద్యార్థిని మాస్టర్ వెంకటేశ్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మైసమ్మకు ప్రత్యేక పూజలు



నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. జనం పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయం ఆవరణ, మైసమ్మ అడవి మొత్తం భక్తులతో నిండిపోయింది.

రాష్ట్ర కమిటీకి ఎంపిక



అబ్దుల్ జకీ



మొహసిన్ పాష ఖాద్రీ

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరు జర్నలిస్టులకు చోటు దక్కింది. టీయూడబ్ల్యూజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ జకీ, రాష్ట్ర కార్యదర్శిగా మొహసిన్‌పాష ఖాద్రీ ఎన్నికయ్యారు. జకీ గతంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేసి, ప్రస్తుత కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జర్నలిస్టుల సంక్షేమమే తమ లక్ష్యమని టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్ అన్నారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ ఉమ్మడి జిల్లా మహాసభలను ఈనెల 7వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కిషోర్, నరేష్, రమణ, సమీ తదితరులు పాల్గొన్నారు.


కనుల పండువగా కల్యాణం



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న టీపీసీసీ సెక్రటరీ అనిరుధ్‌రెడ్డి తదితరులు

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తును గ్రామంలో మేళతాల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా ఊరేగింపులో చిన్నారులు వేసిన కోలాటాలు ఎంతగానో అలరించాయి. ఎదుర్కోళ్ల కార్యక్రమం ముగించిన అనంతరం వందలాది భక్తుల సమక్షంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. స్వామివారికి టీపీసీసీ సెక్రటరీ జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి తలంబ్రాలను సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శశికళారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, నాయకులు దిలీప్‌రెడ్డి, దుశ్యంత్‌రెడ్డి, రవికుమార్‌గుప్తా, రాములుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి రావాలని ఆహ్వానం



నవాబుపేట: మండల కేంద్రంలో సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ వారు ఈనెల 15న జరిగే సేవాలాల్ జయంతి కార్యక్రమానికి రావాలని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనులను అన్ని రకాలుగా ఆదుకుని వారికి కావాల్సిన రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి అధ్యక్షుడు లింబ్యానాయక్, గౌరవ అధ్యక్షుడు చందర్‌నాయక్, శంకర్‌నాయక్, శంకర్, గోపాల్‌నాయక్, సేవ్యా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్పస్వామి పల్లకీసేవ

మరికల్: బీరప్పస్వామి బండారు ఉత్సవాలలో ఆదివారం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. మండల కేంద్రంలోని పాత దేవాలయం నుంచి కొత్త దేవాలయం వరకు స్వామి విగ్రహాన్ని పల్లకీ ఊరేగించారు. భక్తులు ఒకరిపై ఒకరు బండారు చల్లుకుంటూ కొత్త దేవాలయానికి స్వామివారిని పల్లకీలో తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం బీరప్ప స్వామి బండారు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పూజారులు తెలిపారు.

ఘనంగా సంత్ గురు రవిదాస్ జయంతి



నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: బహుజన మహనీయుల శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో సంత్ గురు రవిదాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని పాతపాలమూరు జై భీమ్ చౌరస్తాలో సంతుగురి రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన కుల సంఘాల ప్రతినిధులు స్టీరింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ నాగయ్య, పాతూరి రమేష్, పరమేశ్వర్, బాలరాజు, రాములు, జనార్దన్, కృష్ణయ్య, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టాలెంట్ టెస్ట్

మరికల్: నారాయణపేట జిల్లా స్థాయి టాలెంట్ టెస్టును ఆదివారం మండల కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూసల్ పహాడ్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. మొత్తం 295 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సాగుకు సబ్సిడీ అందేనా?



రాయపల్లి శివారులో సాగుచేసిన వేరుశనగ పంట


రాజాపూర్: అన్నదాతలకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని గొప్పలు చెప్పుకోవడమే తప్పా కావాల్సిన ప్రభుత్వ సహకారం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కూలీల కొరతతో పాటు పెట్టుబడి ఖర్చులు అధికమవ్వడంతో రైతులు ఖర్చు తగ్గించుకునేందుకే ఆలోచిస్తున్నారు. గతంలో బిందుసేద్యం కోసం కావాల్సిన స్ప్రింక్లర్లు, ట్రాక్టర్లపై ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీసీలకు, చిన్న, సన్నకారు రైతులకు 50 నుంచి 90శాతం వరకు సబ్సిడీ ఇచ్చి రైతులను ప్రోత్సహించారు. ప్రస్తుతం సబ్సిడీలను ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో రూ.6వేలు చెల్లిస్తే రైతులకు 90శాతం సబ్సిడీపై 25 స్ప్రింక్లర్ పైపులను అందించేవారు. ఎలాంటి సబ్సిడీలు అందించకపోవడంతో రైతులు అధిక ఖర్చులు అవుతున్నాయి.

జామతోట సాగు చేస్తున్నాం..



రెండేళ్లుగా జామతోటను సాగు చేస్తున్నాం. హార్టికల్చర్ అధికారుల సూచన మేరకు అంతర్‌పంటగా వేరుశనగ సాగు చేశాం. బోరులో నీళ్ల తక్కువగా ఉండటంతో స్ప్రింక్లర్ల ద్వారా పంటకు నీటిని అందించాలి. సకాలంలో పంటకు తడులు అందకపోవడంతో పంట నష్టపోవాల్సి వస్తుంది. స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేద్దామంటే సబ్సిడీ లేదని అధికారులు చెబుతున్నారు.
– సుజాత, రైతు, రాజాపూర్

రెండేళ్లుగా ఇవ్వడం లేదు..



వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాం. ప్రస్తుతం వేరుశనగ, కూరగాయలు, మొక్కజొన్న పంటలు కాల్వల ద్వారా సాగు చేస్తున్నాం. స్ప్రింక్లర్ పైపులు సబ్సిడీ ద్వారా ప్రభుత్వం రెండేళ్లుగా అందించడం లేదు.
– దూళ్ల శ్రీనివాస్, రైతు, రాయపల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం..
రెండేళ్ల నుంచి రైతులు స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి స్ప్రింక్లర్ల పంపిణీకి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. సబ్సిడీ పరికరాలు సరఫరా అయితే పంపిణీ చేస్తాం.
– హిమబింధు, హార్టికల్చర్ అధికారి

మొక్కల సంరక్షణ ఏదీ?

- హరితహారం మొక్కలపై నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



కుచ్చరకల్ రోడ్డులో ఎండిపోయిన మొక్కలు

రాజాపూర్: గ్రామాల్లో, ప్రధాన వీధుల్లో, రహదారులకు ఇరువైపులా పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం ఉండేందుకు అధికారులు ఎన్ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా మొక్కలను నాటుతున్నారు. మొక్కలు నాటడం వరకు బాగానే ఉన్నా.. వాటి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. రాజాపూర్ మండలం కుచ్చరకల్‌కు వెళ్లేదారిలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పోయకపోవడంతో ఎండిపోయాయి. ఇలా గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోయి ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మొక్కలకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని పోయాలని అధికారులు చెబుతున్నా సర్పంచ్‌లు మాత్రం నిర్వహణ ఖర్చులు కూడా రావడం లేదని చెబుతున్నారు. దీంతో మొక్కల సంరక్షణ అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..
హరితహారం మొక్కలను సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీళ్ల పోయాలని సర్పంచ్‌లకు చెబుతున్నాం. చేసిన పనికి బిల్లులు రావడం లేదని అంటున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపడుతాం.
– లక్ష్మీదేవి, ఎంపీడీఓ, రాజాపూర్